సాక్షి
ములుగు

శుక్రవారం । 3 । జనవరి । 2025



దీప్తి.. ఘనకీర్తి

పారా అథ్లెట్.. కల్లెడ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి.. ఘన కీర్తి సాధించారు. దేశం లోనే ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు ఎంపికయ్యారు. - 8లో▸



అభివృద్ధిలో టెక్నాలజీ భాగం


అభివృద్ధిలో టెక్నాలజీ భాగమైందని, టెక్నాలజీని అందిపుచ్చుకుని కంపెనీ అభివృద్ధిలో ముందుకెళ్తోందని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అన్నారు. - 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి చలి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు పొగమంచు కురుస్తుంది.

స్తంభించిన బోధన



విద్యార్థినుల భవిష్యత్ అగమ్యగోచరం

పదోతరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలకు గడువు సమీపిస్తోంది. ఇంటర్ విద్యార్థులకు ఈనెల 22న జేఈఈ మెయిన్స్ పరీక్షలు, ఫిబ్రవరిలో ఇంటర్ ప్రాక్టికల్స్, మార్చి 3 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు, మార్చి రెండో వారంలో పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో కేజీబీవీ టీచర్ల సమ్మె విద్యార్థుల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. కేజీబీవీలో చివరి మూడు నెలల వార్షిక పరీక్షలకు సమాయత్తం చేయడానికి విద్యార్థులకు రివిజన్ వర్క్ స్లిప్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహించాలి. అలాగే మోడల్ ప్రాక్టికల్ పరీక్షలు, మోడల్ జేఈఈ మెయిన్స్, మోడల్ ఎంసెట్ పరీక్షలు, పదో తరగతి విద్యార్థులకు రివిజన్ వర్క్, స్లిప్ టెస్టులు, ప్రీ ఫైనల్స్, మోడల్ పరీక్షలు నిర్వహించాల్సిన కేజీబీవీ టీచర్లు సమ్మె చేస్తుండటంతో విద్యార్థుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారింది. ఈ క్రమంలో విద్యాబోధన నిలిచిపోయింది. విద్యాశాఖ అధికారులు నామమాత్రంగా ఒక్కో కేజీబీవీకి ఇద్దరు నుంచి నలుగురు ఎస్జీటీలను నియమించింది. అయినా స్కూళ్ల నిర్వహణకే సమయం సరిపోతుండటంతో బోధన ముందుకు సాగడం లేదు.

మంగపేట: సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీ) టీచర్లు, సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. 13 డిమాండ్లతో జిల్లా కేంద్రంలో చేపట్టిన సమ్మె గురువారం నాటికి 24వ రోజుకు చేరింది. ఈ క్రమంలో రోజుకో విధంగా నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెకు టీపీటీఎఫ్, పీఆర్టీయూ, టీఎస్ యూటీఎఫ్‌తో పాటు ఇతర ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపి సంఘీభావాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పర్మనెంట్ చేస్తామని రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో సమగ్రశిక్ష ఉద్యోగులకు హామీనిచ్చి మరవడంతో ఉద్యోగులు సమ్మెబాట పట్టారు.



ములుగులో నిరవధిక దీక్షలో కూర్చున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

9 కేజీబీవీలు.. 1,921 మంది విద్యార్థినులు

జిల్లాలోని 9 కేజీబీవీలు ఉండగా ఒక్కో కేజీబీవీలో 16మంది టీచర్లు ఉన్నారు. అలాగే 1,921 మంది బాలికలు ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. ఆయా కేజీబీవీల్లోని విద్యార్థినులకు బోధనతో పాటు రాత్రి వేళల్లో కనీసం ఇద్దరు టీచర్లు విద్యార్థులతో పాటు హాస్టళ్లలో ఉంటూ స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. 2011లో కేజీబీవీల్లో టీచర్లుగా, సర్వశిక్ష ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి అప్పటి విద్యార్థుల సంఖ్య ఆధారంగానే ఇప్పటికీ జీతభత్యాలను ప్రభుత్వం అందిస్తోంది. ఇంటర్ కళాశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్‌కు రూ.లక్ష, అధ్యాపకులకు రూ.70 వేలకు పైగా జీతభత్యాలు లభిస్తుండగా కేజీబీవీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు మాత్రం రూ.29 వేలు మాత్రమే అందిస్తున్నారు. సీఆర్‌టీలకు రూ.26వేలు అందిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కేజీబీవీ టీచర్లు, సమగ్రశిక్ష ఉద్యోగులు ప్రభుత్వానికి నోటీసిచ్చి బోధన బంద్ చేసి ఆందోళన కొనసాగిస్తున్నారు.

సమ్మె ఉధృతం

24 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో కేజీబీవీల్లో స్పెషలాఫీసర్లు, బోధనా సిబ్బంది స్థానంలో మండల విద్యావనరుల కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులను తీసుకోవాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ఆలస్యమైతే ఆ లోపు పేస్కేలు ఇచ్చి ఉద్యోగ భద్రత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి..



ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల అధ్యాపకులకంటే కేజీబీవీ పాఠశాలల టీచర్లు అహర్నిషలు పనిచేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్నాం. తమ పిల్లలకంటే ఎక్కువగా అభిమానిస్తూ విద్యాబోధన చేస్తున్నాము. కేజీబీవీ టీచర్లకు, ఉద్యోగులకు పదేళ్ల నాటి జీతభత్యాలు నేటికీ చెల్లించడం సరికాదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులందరి డిమాండ్లను పరిష్కరించాలి.

– కె.జీవనప్రియ, సమగ్రశిక్ష మహిళా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు

మానవతా దృక్పథంతో ఆలోచించాలి



సంవత్సరాల తరబడి అవిశ్రాంతంగా అంకితభావంతో బాధ్యతా యుతంగా పనిచేస్తున్న తమను పర్మనెంటు చేయాలి. టైం స్కేలు ఇవ్వాలి. కేజీబీవీ టీచర్లు, సమగ్రశిక్ష ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె గురించి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలి. వెంటనే సరైన నిర్ణయం తీసుకుని కేజీబీవీ టీచర్లు, సమగ్రశిక్ష ఉద్యోగులను చర్చలకు ఆహ్వానించి సమస్యను పరిష్కరించాలి. కేజీబీవీల్లో బోధన సంపూర్ణంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– చల్లా భాస్కర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా జేఏసీ అధ్యక్షుడు

జిల్లా అభివృద్ధికి కృషి

కలెక్టర్ టీఎస్.దివాకర



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు: మంత్రి సీతక్క ఆదేశాలతో జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అందుకు పాత్రికేయులు సహకరించాలని కలెక్టర్ దివాకర అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పర్యాటకంగా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బిల్ట్ ఫ్యాక్టరీ తెరిపించడానికి ప్రభుత్వానికి నివేదిక అందించామని తెలిపారు. జిల్లాలో 400ఎకరాల స్థలంలో పలు రకాల పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి ముందడుగు వేశామని వివరించారు. సీఎస్ఆర్ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఉత్తమ బోధన చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మంత్రి, కలెక్టర్‌ను కలిసిన టీజీఓ నాయకులు

మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సంపత్‌రావు, ప్రధాన కార్యదర్శి జీవన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లను అందించారు. దీంతో పాటు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ కలెక్టర్‌కు పూలమొక్క అందించారు. అనంతరం నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలు రాజు ఆధ్వర్యంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొంరయ్య, శిరీష, విజయభాస్కర్, జితేందర్‌రెడ్డి, శైలజ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి

ఎస్పీ శబరీశ్



మావోయిస్టుల కుటుంబ సభ్యులతో ఎస్పీ

ములుగు: మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి ప్రశాంత జీవితాన్ని గడపాలని ఎస్పీ డాక్టర్ శబరీష్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని హెడ్‌క్వార్టర్స్‌లో మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న, బడే చొక్కారావు అలియాస్ దామోదర్, కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్, పుసం పద్మ అలియాస్ గంగక్క, ఈసం అర్జున్ అలియాస్ రఘుపతి, సదనపల్లి చందూ కుటుంబ సభ్యులతో కొద్దిసేపు గడిపారు. దళంలో ఉన్న వారు పోలీసుల ఎదుట లొంగిపోయేలా కృషి చేయాలని సూచించారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. అనంతరం వారికి పండ్లు, దుస్తులు అందజేశారు.

వైద్యసిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌ఓ

ములుగు: వైద్య సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో చేరుకొని రాష్ట్రంలో జిల్లాను ముందువరుసలో నిలబెట్టాలని డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్యశాఖ సమావేశ మందిరంలో పీహెచ్‌సీ వైద్యులు, ఆర్‌బీఎస్కే, ప్రోగ్రాం అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో పటిష్టమైన సూక్ష్మ ప్రణాళికను తయారుచేసుకొని క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు అందించాలని సూచించారు. అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, స్క్రీనింగ్ వచ్చే నెల చివరి వారం వరకు పూర్తి చేయాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా మందులు అందించాలన్నారు. వైద్యులు, సిబ్బందితో 100 లక్ష్యాలు చేరుకునేలా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు పవన్‌కుమార్, శ్రీకాంత్, రణధీర్, చంద్రకాంత్, డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు దుర్గారావు, పూర్ణ, సంపత్‌రావు, శకుంతల, సాంబయ్య, స్వరూపరాణి, సురేష్‌బాబు, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మంత్రి సీతక్కను కలిసిన కలెక్టర్



ములుగు: కలెక్టర్ దివాకర మంత్రి సీతక్కను క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పూలమొక్క అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ డాక్టర్ శబరీష్, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్‌లు వేర్వేరుగా మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధిపై చర్చించారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్: తెలంగాణ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీఓ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థులు ఇంగ్లిష్ మీడియం గురుకులంలో 5వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు కులం, ఆదాయం, ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, ఫొటోలు అవసరమని వివరించారు. అన్ని గురుకులాలకు కామన్ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా గురుకులాలను కేటాయించనున్నట్లు వెల్లడించారు. టీజీఆర్ఐఈఎస్, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, ఎంజేపీ బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాలలో అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తులు హెచ్‌టీటీపీఎస్:// టీజీసీఈటీ.సీజీజీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

7న మెగా జాబ్‌మేళా

గోవిందరావుపేట: జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 7వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఈజీఎంఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ ద్వారా ఈ నెల 7న మండల పరిధిలోని చల్వాయిలో గల పీఎస్ఆర్ గార్డెన్‌లో జాబ్ మేళాను మంత్రి సీతక్క ప్రారంభిస్తారని వెల్లడించారు. జిల్లాలోని పదో తరగతి నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన వారు పాల్గొని ఉద్యోగం పొందాలని సూచించారు. ఈ జాబ్‌మేళాలో వివిధ కంపెనీలకు సంబంధించిన 50 కంపెనీలు పాల్గొంటాయని వివరించారు. ఈ జాబ్‌మేళాలో 15వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.

అన్నమయ్య కళామండలి జిల్లా కమిటీ ఎన్నిక

ములుగు: శ్రీశ్రీశ్రీ అన్నమయ్య కళామండలి జిల్లా కమిటీని గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంపటి మహేందర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా చిగిరి అరుణ, ఉపాధ్యక్షురాలిగా గుంజె కోమల, కార్యదర్శిగా ధరంసోత్ వసంత, సహాయ కార్యదర్శిగా కేలోత్ దివ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ వివిధ కళారంగాలకు చెందిన వారికి ఉపాధి నిమిత్తం శిక్షణను అందిస్తూ నైపుణ్యం కలిగిన కళాకారులుగా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని వివరించారు.

గ్రామాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలి



వాజేడు: వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కోరం క్రాంతికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. మందులు, ల్యాబ్, రికార్డులతో పాటు ఆస్పత్రి వెనుక భాగంలో నిర్మిస్తున్న వెయిటింగ్ గదుల పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి మహేందర్, నర్సింహరావు, కోటిరెడ్డి, భాగ్యలక్ష్మి, శిరీష ఉన్నారు.

వనదేవతలకు మోకాళ్లపై మొక్కులు

సమస్యలు పరిష్కారం అయ్యేలా దీవించాలని సీఆర్‌టీల వేడుకోలు



సమ్మక్కకు పూజలు చేస్తున్న సీఆర్‌టీలు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీలు గురువారం వనదేవతలు సమ్మక్క–సారలమ్మలను దర్శించుకుని మోకాళ్లపై నిలబడి అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సీఆర్‌టీలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో 20ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. 11రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉపాధ్యాయులు మినిమం టైం స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని, మహిళా ఉపాధ్యాయులకు ప్రసూతి సెలవులు ప్రకటించాలన్నారు. సీఆర్‌టీల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారం అయ్యేలా చూడాలని అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పోడెం రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధరంసోత్ రాజు, వట్టం శంకర్, అరుణ్ కుమార్, శ్రీరామ్ కిషన్, దేవేందర్, వీరన్న, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగించకుండా జీఓ విడుదల చేయాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

మంగపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించకుండా ప్రభుత్వం ప్రత్యేక జీఓను విడుదల చేయాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో గడ్డం భారతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పాఠశాల వంట కార్మికుల సమావేశంలో పాల్గొన్న రవీందర్ మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం, తరగతితో సంబంధం లేకుండా ప్రతీ విద్యార్థికి మెస్‌చార్జీ రూ.25 చెల్లించాలన్నారు. కోడిగుడ్లు, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. 22 సంవత్సరాలుగా సొంత డబ్బులు పెట్టి పాఠశాలల్లో వంటలు చేస్తూ పెట్టిన పెట్టుబడి బిల్లులు, వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారన్నారు. వారి సర్వీసు దృష్ట్యా వారిని తొలగించకుండా ప్రభుత్వం ప్రత్యేక జీఓ తీసుకురావాలన్నారు. అదే విధంగా వేతనాలు, డ్రెస్‌కోడ్, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదాలు జరిగినప్పుడు పరిహారాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లను కల్పించాలన్నారు. ఈ సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా పరిష్కారం కాలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వంటలు బంద్ చేసి సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు గడ్డం భారతి, జయమ్మ, లక్ష్మి, రాజకుమారి, తులసి, అమీణ, రమణ పాల్గొన్నారు.

బదిలీలపై నిషేధం

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో మే 31వ తేదీ వరకు బదిలీలపై నిషేధం విధిస్తున్నట్లు సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను సింగరేణి యాజమాన్యం 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని విధించగా డిసెంబర్ వరకు 46.30 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. మిగిలిన ఉత్పత్తిని సాధించేందుకు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క



నివాళులర్పిస్తున్న మంత్రి, నాయకులు



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే గెలుపు తథ్యమని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. మండల పరిధిలోని చల్వాయి గ్రామ శివారులోని సోమలగడ్డ వద్ద ఉన్న పీఎస్ఆర్ గార్డెన్‌లో గురువారం డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ దేశ ప్రధానమంత్రిగా రెండు పర్యాయాలు పనిచేసి ఎన్నో పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ఇంగ్లిష్, ఉర్దూలో అనర్గళంగా మాట్లాడే మేధావని తెలిపారు. ఆయన మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆయన సేవలను కొనియాడారు. కార్యకర్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కూడా అర్హులకు అందేలా చూడాలన్నారు. పార్టీ అభ్యున్నతికి పనిచేస్తున్న ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం, పదవులు దక్కుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళి రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మండల అధ్యక్షుడు వెంకటకృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘తునికాకు యూనిట్ల రద్దు దుర్మార్గం’



మాట్లాడుతున్న బండారు రవికుమార్

గోవిందరావుపేట: తునికాకు యూనిట్ల రద్దు దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. మండలంలోని పస్రాలో గల పార్టీ కార్యాలయంలో కొప్పుల రఘుపతి ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 300 యూనిట్ల తునికాకు టెండర్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ఆ ప్రమాదం జిల్లాకు ఉందని అందుకే తెలంగాణలో వెంటనే తునికాకు టెండర్లు పిలవాలని కోరారు. తునికాకు గిరిజనులు, పేద ప్రజలకు ఒక పంట లాంటిదని వివరించారు. కేంద్ర ప్రభుత్వం బడా పెట్టుబడిదారుల కోసం అడవిలో యురేనియం తవ్వకాల కోసం తునికాకు యూనిట్లు రద్దు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, తుమ్మల వెంకట్ రెడ్డి, రత్నం రాజేందర్, పొదిళ్ల చిట్టిబాబు, దావుద్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల కూలి పెంచాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్

ములుగు రూరల్: సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికుల కూలిని పెంచాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం జిల్లాకేంద్రంలోని మార్కెట్ గోదాం వద్ద సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. గత సంవత్సరం హమాలీ కార్మికులు ధరలు పెంచాలని కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ పోరాటంతో రేట్లు పెంచుతామని ప్రభుత్వం హామీనిచ్చి అమలు చేయడం లేదన్నారు. పెంచిన ధరల జీఓను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్ బకాయిలను సైతం వెంటనే విడుదల చేయాలన్నారు. సివిల్ సప్లయీస్ కార్మికులకు ప్రమాద బీమా కల్పించాలన్నారు. కార్మికులకు యూనిఫాం కుట్టుకూలి, పండగ బోనస్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీందర్, సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, రాంబాబు, రమేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమ్మెకు సంఘీభావం..

వెంకటాపురం(కె): జీసీసీ హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట మల్లికార్జున రావు అన్నారు. మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయం ఎదుట హమాలీలు చేపట్టిన సమ్మె శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా క్వింటాకు రూ.26 నుంచి 29 రూపాయలకు పెంచాలన్నారు. రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజు, నాయకులు రాంబాబు, సోమరాజు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నెమళ్ల కనువిందు

- జూపార్క్‌లో బయట తిరుగుతున్న మయూరాలు
- ఘర్షణ ఆపడానికే బయటకు వదిలాం.. జూపార్క్ ఇన్‌చార్జ్



న్యూశాయంపేట: హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జూపార్క్‌లో నెమళ్లు తిరుగుతూ సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. ఎన్‌క్లోజర్స్‌లో ఉండాల్సిన నెమళ్లు.. మొసళ్లు ఆవాసం ఉండే ప్రాంతం పక్కన చెట్ల పొదల్లో తచ్చాడుతుండగా సాయంత్రం వేళ 'సాక్షి' కెమెరాకు చిక్కాయి. అధికారుల నిర్లక్ష్యంతో నెమళ్లు బయట తిరుగుతున్నాయని, పార్క్ బయటకు వెళ్తే వేటగాళ్ల ఉచ్చులో పడి బలైపోతాయని జంతు ప్రేమికులు అంటున్నారు. కాగా, ఈ విషయంపై జూపార్క్ ఇన్‌చార్జి, ఎఫ్ఆర్ఓ మయూరిని వివరణ అడగగా రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా బయట నుంచి తీసుకొచ్చిన నెమళ్లు ఎన్‌క్లోజర్స్‌లో ఉంచితే కొత్త, పాత పక్షులు ఘర్షణ పడుతాయని, వాటి రక్షణ కోసం తామే పార్క్ చెట్ల పొదల మధ్య వదిలామని తెలిపారు. బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సీఈగా చైతన్యకుమార్



ఉత్తర్వులు అందుకుంటున్న చైతన్యకుమార్

కేసముద్రం: రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సీఈగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తావుర్యాతండాజీపీకి చెందిన చైతన్య కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. తండాకు చెందిన ఎం. చైతన్యకుమార్ 1994లో వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేసి ఎన్నో ప్రశంసలు, అవార్డులు అందుకున్నట్లు తండావాసులు తెలిపారు.కాగా, చైతన్యకుమార్ నియామకంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేయూలో హాస్టల్ నుంచి విద్యార్థి సస్పెన్షన్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న హెచ్ఆర్ఎం విభాగం సెకండియర్ విద్యార్థి గత నెల 31న న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మద్యం సేవించి జగ్జీవన్ రామ్ హాస్టల్‌కు వెళ్లి న్యూసెన్స్ చేశాడు. అంతేగాకుండా అక్కడ ఎంకామ్ సెకండియర్ విద్యార్థిపై దాడికి పాల్పడ్డాడు. ఈ వ్యవహారం అప్పుడే పెట్రోలింగ్ చేస్తున్న పోలీసుల దృష్టికి వెళ్లడంతో న్యూసెన్స్ చేస్తున్న విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చారని సమాచారం. ఈ ఘటనపై గురువారం కేయూ హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ బాధిత ఎంకామ్ విద్యార్థితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఈ ఘటనను రిజిస్ట్రార్ మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. న్యూసెన్స్ చేసి, విద్యార్థిపైదాడికి పాల్పడిన హెచ్ఆర్ఎం విద్యార్థిని నాలుగువారాల పాటు హాస్టల్‌నుంచి సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసినట్లు హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఆ ఉత్తర్వులను యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌కు, ఆవిభాగం అధిపతికి కూడా పంపామని రాజ్‌కుమార్ తెలిపారు.

పతకాలు సాధించిన హనుమకొండ జిల్లా రెజ్లర్లతో డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్, అసోసియేషన్ బాధ్యులు



మూడు విడతల్లో పోటీలు..

రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు మూడు విడతల్లో నిర్వహించగా విజేతలకు ఎప్పటికప్పుడు పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు. మొదటి విడతలో డిసెంబర్ 19వ తేదీన జిమ్నాస్టిక్స్ పోటీలు ప్రారంభమై 22వ తేదీ వరకు కొనసాగాయి. అనంతరం రెండో విడతలో డిసెంబర్ 27వ తేదీన హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం కాగా 30వ తేదీన ముగిశాయి. చివరి విడత డిసెంబర్ 31నుంచి జనవరి 2వ తేదీ వరకు రెజ్లింగ్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు జరిగాయి.

సంగ్రామం.. సమాప్తం

ముగిసిన సీఎంకప్ క్రీడా పండుగ

- 14 రోజులు.. 6 క్రీడాంశాల్లో పోటీలు
- రెజ్లింగ్‌లో ఆతిథ్య వరంగల్ జిల్లాకు ఏడు పతకాలు
- అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ భద్రాద్రికొత్తగూడెం

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 14 రోజులు కొనసాగిన సీఎం కప్ క్రీడా పండుగ గురువారం సాయంత్రం ముగిసింది. ఆరు క్రీడాంశాలలో నిర్వహించిన పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 4వేలపై చిలుకు క్రీడాకారులతో పాటు టెక్నికల్ అఫీషీయల్స్ హాజరైనట్లు హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ వెల్లడించారు.

రెజ్లింగ్‌లో ఏడు పతకాలు..

ముగింపు వేడుకలకు సీఎం ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రెజ్లింగ్, అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన రెజ్లింగ్ పోటీల్లో హనుమకొండ క్రీడాకారులు ప్రతిభ చాటి ఏడు పతకాలను కైవసం చేసుకున్నారు. సబ్‌జూనియర్స్ 60కేజీల విభాగంలో వి. గణేశ్, 53 కేజీల కేటగిరీలో బి. అంజలి, 48 కేజీల విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించారు. ఎస్. అరుజన్‌సాగర్ కాంస్య పతకం సాధించారు. జూనియర్ బాలికల విభాగంలో 50కేజీల బి. ప్రణవి, 59 కేజీల లోజె చిన్ని, 61 కేజీల కొర్ర అఖిల్ స్వర్ణ పతకాలు సాధించగా, 57కేజీల విభాగంలో ఎ. రాహుల్ రజత పతకం సాధించాడు. విజేతలను హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్ కుమార్, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం, వరంగల్, హనుమకొండ జిల్లాల రెజ్లింగ్ అసోసియేషన్ల కార్యదర్శులు సుధాకర్, షేక్‌రియాజ్, రెజ్లింగ్ కోచ్‌లు కె.రాజు, ఎం. జైపాల్ అభినందించారు.

అథ్లెటిక్స్‌లో నువ్వా?నేనా..

నువ్వా?నేనా అన్నట్లు సాగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం 33 జిల్లాల అథ్లెట్లు పోటీపడగా 86 పాయింట్లతో భద్రాద్రి కొత్తగూడెం ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. తర్వాత 62 పాయింట్లతో రెండో స్థానంలో ఖమ్మం జిల్లా అథ్లెట్లు నిలిచారు. 46 పాయింట్లతో మూడో స్థానాన్ని హైదరాబాద్ దక్కించుకుంది.

దీప్తి.. ఘన కీర్తి

పారా అథ్లెట్, కల్లెడ ముద్దుబిడ్డ దీప్తి జీవాంజికి అర్జున అవార్డు

- కుటుంబీకులు, ప్రజలు, క్రీడాభిమానుల హర్షం



జీవాంజి దీప్తి

పర్వతగిరి: పారా అథ్లెట్, వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన జీవాంజి దీప్తి.. ఘన కీర్తి సాధించారు. దేశంలోనే ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు ఎంపికయ్యారు. పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించడంతో భారత ప్రభుత్వం దీప్తిని ఈ అవార్డుకు గురువారంఎంపిక చేసింది. ఈనెల 17వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా దీప్తి ఈ అవార్డును అందుకోనున్నారు. దీనిపై జీవాంజి దీప్తితో పాటు ఆమె కుటుంబ సభ్యులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవాంజి దీప్తికి అర్జున అవార్డు.. దివ్యాంగుల శక్తికి నిదర్శనం

జీవాంజి దీప్తికి అర్జున అవార్డు రావడం దివ్యాంగుల శక్తికి నిదర్శనమని స్టేట్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్–వికలాంగుల విభాగం గౌరవ అధ్యక్షుడు ముత్తినేని వీరయ్య అన్నారు. ఈ మేరకు జీవాంజి దీప్తిని గురువారం ఆయన సన్మానించారు. పారాలింపిక్స్‌లో భారతదేశం తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తి అర్జున అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జీవాంజి దీప్తిని పారా క్రీడాకారులు ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అర్జున అవార్డు రావడం అదృష్టంగా భావిస్తున్నాం..

మా కూతురు జీవాంజి దీప్తికి ప్రతిష్టాత్మక అర్జున అవార్డు రావడం అదృష్టంగా భావిస్తున్నాం.దీప్తిని చిన్నప్పుడు అందరూ అవహేళన చేసే వారు. ఈ అవమానాలను దిగమింగుకుంటూ కష్టపడి ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, కోచ్ నాగపురి రమేశ్, ఆర్డీఎఫ్ విద్యా సంస్థల చైర్మన్ రామ్మోహన్‌రావు సహకారంతో అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో పారా ఒలింపిక్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించింది. ఈరోజు అర్జున అవార్డుకు ఎంపికకావడం దీప్తి తల్లిదండ్రులుగా గర్వపడుతున్నాం.

–జీవాంజి ధనలక్ష్మి, యాదగిరి, దీప్తి తల్లిదండ్రులు

దీప్తిని స్ఫూర్తిగా తీసుకుని మరో అడుగు ముందుకు..



అర్జున అవార్డుకు ఎంపికైన జీవాంజి దీప్తిని స్ఫూర్తిగా తీసుకుని మరో అడుగు ముందుకు వేస్తా. ఆంధ్రాకు చెందిన అర్జున అవార్డు గ్రహీత వై.జ్యోతికి కోచ్‌గా వ్యవహరించా. దీప్తి, జ్యోతికి అర్జున అవార్డు రావడం అదృష్టంగా భావిస్తున్నా. వీరి స్ఫూర్తితో మరిన్ని అర్జున, ఖేల్‌రత్న, పద్మశ్రీ అవార్డులు పొందేందుకు విద్యార్థులకు చేయూతనందిస్తా. జీవాంజి దీప్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.కోటి నగదు, 500గజాల ఇంటి స్థలం, ఉద్యోగం కల్పించడం హర్షణీయం.

–నాగపురి రమేశ్, కోచ్

హమాలీలకు వేతనాలు, బకాయిలు చెల్లించాలి

- తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మునీశ్వర్



హన్మకొండ: హమాలీల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న జి.మునీశ్వర్

హన్మకొండ/ వరంగల్ : సివిల్ సప్లయ్ హమాలీ రేట్ల పెంపుపై కుదుర్చుకున్న ఒప్పందం మేరకు హమాలీలకు వేతనాలు, బకాయిలు చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మునీశ్వర్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధనకు సివిల్ సప్లయ్ హమాలీలు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం హనుమకొండ గోకుల్ నగర్‌లోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద, వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని సివిల్ సప్లయ్ గోదాంల వద్ద దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను జి.మునీశ్వర్ ప్రారంభించి మాట్లాడుతూ 2024 అక్టోబర్ 4న సివిల్ సప్లయ్ కమిషనర్.. హమాలీల సమస్యలపై ఒప్పందం చేసుకున్నారని, మూడు నెలలు గడుస్తున్నా ఒప్పందం మేరకు జీఓ విడుదల చేయాల్సి ఉండగా కాలయాపన చేస్తూ హామీలకు నష్టం చేకూరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం హమాలీల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్, హమాలీ సంఘం నాయకులు కుక్కల మల్లయ్య, కొనుపుల భిక్షపతి, కన్నబోయిన కుమార్, బోయిని సమ్మయ్య, బోయిని కట్టయ్య, ఆకుల సుధాకర్, దామెర కృష్ణదేవర, రాంబాబు, చంద్రమౌళి, రవి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

- గొల్లచర్లలో ఘటన



ఉమ (ఫైల్)

డోర్నకల్ : అత్తింటి వేధింపులతో మండలంలోని గొల్లచర్లలో వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. డోర్నకల్ సీఐ బి.రాజేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ ఉమ(18) రెండు సంవత్సరాల క్రితం గ్రామంలోని వడ్డెర కాలనీకి చెందిన ఆలకుంట చంటిని ప్రేమ వివాహం చేసుకుంది. సంవత్సరం క్రితం పాప జన్మించినప్పటి నుంచి ఉమకు అత్తింటి నుంచి వేధింపులు మొదలయ్యాయి. భర్త చంటితోపాటు అత్త స్వప్న, మామ భద్రయ్య, ఆడపడుచు కావేరి వివిధ రకాలుగా వేధించ సాగారు. పలుమార్లు పంచాయితీ నిర్వహించినా గొడవలు కొనసాగుతుండడంతో ఉమ తన తల్లి వద్దకు వెళ్లింది. ఈ నేపథ్యంలో గత నెల 28న చంటి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అదే రోజు సాయంత్రం భర్తను చూసేందుకు ఉమ ఆస్పత్రికి వెళ్లగా అత్త, మామ, తదితరులు ఉమను తీవ్రంగా దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన ఉమ పురుగుల మందు తాగి గొల్లచర్లలోని తన ఇంటికి వెళ్లి పడిపోయింది. కుటుంబీకులు వెంటనే ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు డోర్నకల్ పీఎస్‌లో కేసు నమోదు చేయగా మహబూబాబాద్ డీఎస్పీ విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు..

శాయంపేట : మద్యం మత్తులో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం శాయంపేటలో జరిగింది. ఎస్సై జక్కుల పరమేశ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అబ్బు భాస్కర్ రెడ్డి(33) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన భార్య రసన్య బోనాల పండుగకు తల్లిగారింటికి వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం మద్యం సేవించి మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

ధర్మసాగర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం మండలంలోని ధర్మపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లక్కాకుల రాజు (44) కొంతకాలంగా మద్యానికి బానిసై తరచూ కుటుంబీకులతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం కూడా మద్యం తాగొచ్చి గొడవ పడ్డాడు. మత్తులో పురుగుల మందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అభివృద్ధిలో టెక్నాలజీ భాగం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



సీఎండీ వరుణ్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌చార్జ్ డైరెక్టర్లు

హన్మకొండ: అభివృద్ధిలో టెక్నాలజీ భాగమైందని, ఈ టెక్నాలజీని అందిపుచ్చుకుని కంపెనీ అభివృద్ధిలో ముందుకెళ్తోందని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ వరుణ్ రెడ్డిని డైరెక్టర్లు, ఆయా అసోసియేషన్, సంఘాల నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్పీడీసీఎల్‌లో ఇప్పటికే సాంకేతికంగా ఎన్నో మార్పులు తీసుకువచ్చామని, భవిష్యత్‌లో కూడా టెక్నాలజీ పరంగా చాలా అభివృద్ధి ఉంటుందని వివరించారు. ప్రతీ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌పై 1912 టోల్ ఫ్రీ నంబర్ ముద్రించి విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతీ ఉద్యోగి నిబద్ధతతో విధులు నిర్వర్తించి కంపెనీ మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, సదర్ లాల్,వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు అశోక్, బీకంసింగ్, కె.ఎస్.గుట్ట, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు

హసన్‌పర్తి : న్యూయర్ వేడుకల పేరిట మహిళా హాస్టల్‌లో న్యూసెన్స్‌చేయడమే కాకుండా విద్యార్థులపై దాడి చేసిన ఘటనలో నమోదైన కేసులో నలుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న హాస్టల్ నిర్వాహకుడి కుమారుడు సాయి కౌశిక్‌తోపాటు మరో ముగ్గురు యువకులను పోలీసులు అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా మంగళవారం రాత్రి గుండ్లసింగారం సమీపంలోని సరస్వతి మహిళా హాస్టల్‌పై అంతస్తులో సాయి కౌశిక్‌తో పాటు మరో ముగ్గురు విద్యార్థులు అతిగా మద్యం తాగి అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈమేరకు విద్యార్థినుల ఫోన్ ద్వారా ఇచ్చిన సమాచారం మేరకు సమీపంలోని హాస్టల్‌లో ఉంటున్న బి.టెక్ విద్యార్థులు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. మరుసటి రోజు కూడా గొడవ జరిగింది. రాత్రి వచ్చిన విద్యార్థులను పిలిచి వారిపై దాడి చేశారు. ఈ ఘటనపై విద్యార్థుల ఫిర్యాదు మేరకు పోలీసులు సాయి కౌశిక్‌తోపాటు ముగ్గురిపై కేసు నమోదు చేసి గురువారం వారిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం వారిని కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

మారిన పుష్‌పుల్ రైళ్ల నంబర్లు..

- జనవరి 1 నుంచి అమలు
- రైల్వే బ్లాక్‌తో 6 రైళ్లు రద్దు.. 11 దారి మళ్లింపు



కాజీపేట రూరల్ : కాజీపేట, వరంగల్, డోర్నకల్, విజయవాడ, సికింద్రాబాద్ మధ్య ప్రయాణించే పలు పుష్‌పుల్ రైళ్ల నంబర్లు మారినట్లు కాజీపేట రైల్వే కమర్షియల్ అధికారులు గురువారం తెలిపారు. మారిన పుష్‌పుల్ ట్రైన్ నంబర్లు జనవరి 1వ తేదీ నుంచి అమలు చేసి నడిపిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

నంబర్లు మారిన రైళ్లు ఇవే..

కాజీపేట–డోర్నకల్ (పాత నంబర్ 07753/ కొత్త నంబర్ 67765) పుష్‌పుల్, డోర్నకల్–కాజీపేట (పాత నంబర్ 07754/కొత్త నంబర్ 67766) పుష్‌పుల్, కాజీపేట–సికింద్రాబాద్ (పాత నంబర్ 07757/ కొత్త నంబర్ 67764) పుష్‌పుల్, సికింద్రాబాద్–కాజీపేట (పాత నంబర్ 07758/ కొత్త నంబర్ 67763) పుష్‌పుల్, సికింద్రాబాద్–వరంగల్ (పాత నంబర్ 07462/ కొత్త నంబర్ 67761) పుష్‌పుల్, వరంగల్–సికింద్రాబాద్ (పాత నంబర్ 07463/కొత్త నంబర్ 67762) పుష్‌పుల్.

రైల్వే బ్లాక్‌తో పలు రైళ్ల రద్దు

కాజీపేట–విజయవాడ రూట్‌లో మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులతో పలు రైళ్లను రద్దు చేసి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్ల వివరాలు

2024 డిసెంబర్ 25వ తేదీ నుంచి 2025 జనవరి 9వ తేదీ వరకు కాజీపేట–డోర్నకల్(07753) పుష్‌పుల్, డోర్నకల్–కాజీపేట (07754) పుష్‌పుల్, జనవరి 5,7,8,9వ తేదీన గుంటూరు–సికింద్రాబాద్ (12705) డైలీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–గుంటూరు (12706) డైలీ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, జనవరి 4,7,8,9వ తేదీల్లో విజయవాడ–సికింద్రాబాద్ (12713) డైలీ శాతవాహన ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్–విజయవాడ (12714) డైలీ శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లు రద్దయినట్లు అధికారులు తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

జనవరి 8వ తేదీన విశాఖపట్నం–ఎల్‌టీటీ (18519) డైలీ ఎక్స్‌ప్రెస్, జనవరి 6,8వ తేదీల్లో షాలిమార్–హైదరాబాద్ (18045) ఎక్స్‌ప్రెస్, జనవరి 7,9వ తేదీల్లో హైదరాబాద్–షాలిమార్ (18046) ఎక్స్‌ప్రెస్, జనవరి 7వ తేదీన షిర్డీ–కాకినాడ (17205) ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం–షిర్డీ (17208) ఎక్స్‌ప్రెస్, జనవరి 8వ తేదీన కాకినాడ–షిర్డీ (17206) ఎక్స్‌ప్రెస్, షిర్డీ–మచిలీపట్నం (17207) ఎక్స్‌ప్రెస్, జనవరి 6,8వ తేదీల్లో ముంబాయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్–ముంబాయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, జనవరి 7వ తేదీన సికింద్రాబాద్–షాలిమార్ (12774) ఎక్స్‌ప్రెస్ రైళ్లను వరంగల్, కాజీపేట మీదుగా కాకుండా వయా విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అంత్యక్రియలకు వెళ్లి అనంతలోకాలకు..

- చెట్టును ఢీకొన్న కారు.. యువకుడి మృతి
- జనగామ జిల్లా కొడకండ్ల మండలంలో ఘటన
- చంపేసి కారు ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని మృతుడి తండ్రి ఆరోపణ



సుమన్ (ఫైల్)

మరిపెడ రూరల్/కొడకండ్ల: ఓ యువకుడు బంధువు అంత్యక్రియలకు వెళ్లాడు. అక్కడ స్నేహితుతో కలిసి సరదాగా కారులో బయటకు వెళ్లి శవమయ్యాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం డీఎస్ఆర్‌జిందాల్ తండా జీపీలోని కొమటికుంటతండాకు చెందిన బానోత్ సుమన్ (26) ఖమ్మం జిల్లా కాకరవాయిలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో జనవరి 1వ తేదీన తన మామ ఊరు మహబూబాబాద్ జిల్లా కేంద్రం ఇందిర కాలనీ సింగిలాల్‌తండాలో బంధువు అంత్యక్రియలకు వెళ్లాడు. అక్కడ బంధువులు ధరావత్ దేవాదాసు, ధరావత్ ప్రశాంత్, భూక్య వినోద్, మూడ్ వినోద్‌తో కలిసి కారులో అదే రోజు రాత్రి సరదాగా బయటకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వీరు ప్రయాణిస్తున్న కారు జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగుల గ్రామ సమీపంలో ఓ చెట్టును ఢీకొంది. డ్రైవర్ పక్కన ముందు సీట్లో కూర్చున్న సుమన్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నలుగురు వ్యక్తులు సుమన్ మృతదేహాన్ని అదే కారులో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి తీసుకొచ్చారు. సింగిలాల్‌తండాలోని మృతుడి మామ ఇంటి ఎదుట పార్క్ చేసి పరారయ్యారు.

నా కొడుకును చంపేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారు

'పథకం ప్రకారమే నా కొడుకును నలుగురు కలిసి కారులో బలంతంగా బయటకు తీసుకెళ్లారు. అక్కడ ఏ జరిగిందో ఏమో కొడుకు శవాన్ని తీసుకొచ్చి నా బావమరిది ఇంటి వద్ద ఉంచి నలుగురు పరారయ్యారు' అని మృతుడి తండ్రి బానోత్ దేవుజా ఆరోపించాడు. పరారీలో ఉన్న వారికి ఫోన్ చేస్తే చెట్టుకు కారు ఢీకొందని, ఎదురుగా మరో కారు ఢీకొట్టడంతో దానిని వెంబడించామని పొంతన లేని సమాధానం చెబుతున్నారని, వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కన్నీటి పర్యంతమయ్యాడు. మృతుడికి భార్య అనసూర్య, 3 సంవత్సరాల కుమారుడు, ఏడాది కుమార్తె ఉన్నారు. కాగా, ఈ ఘటనపై మృతుడి తండ్రి దేవుజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొడకండ్ల ఎస్సై రాజు గురువారం తెలిపారు.

కూతురును చూసి తిరుగు ప్రయాణంలో మృత్యుఒడికి..

- ట్రాక్టర్, బైక్ ఢీ.. ఒకరి మృతి
- బావోజీ తండాలో ఘటన



లక్ష్మణ్ (ఫైల్)

పెద్దవంగర: తన కూతురు అమ్మమ్మ ఇంటివద్ద ఉండగా చూసేందుకు వచ్చాడు. బిడ్డతో సరదాగ కాసేపు ముచ్చటించాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్, స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం నిధానపురం గ్రామానికి చెందిన యాసాని లక్ష్మణ్ (38) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అత్తగారి గ్రామం ఇదే జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగరలో కూతురు హేమశ్రీ అమ్మమ్మ వద్ద ఉంటుంది. తన బిడ్డను చూసి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో పెద్దవంగర మండలం బావోజీ తండాకు చెందిన బానోత్ వెంకటేశ్ ట్రాక్టర్‌ను నడుపుతూ చిట్యాల నుంచి తన తండాకు చేరుకునే క్రమంలో బైక్‌పై వస్తున్న లక్ష్మణ్‌ను ప్రాథమిక పాఠశాల సమీపంలో ఢీకొన్నాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందజేశారు. తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సునీత, కూతురు హేమశ్రీ ఉన్నారు. మృతుడి తండ్రి పరశురాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మారుకా మచ్చల పురుగుతో జాగ్రత్త..

కంది పంటను ఆశిస్తున్న పురుగు

- యాజమాన్య చర్యలు చేపట్టాలి
- డీఏఓ ఎం.విజయనిర్మల

మహబూబాబాద్ రూరల్ : రైతులు సాగు చేసే అపరాలలో కంది ముఖ్యమైన పంటకాగా ప్రస్తుతం పూత, పిందే దశలో ఉంది. ఈ తరుణంలో మారుకా మచ్చల పురుగు ఆశిస్తుందని, సకాలంలో యాజమాన్య చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయనిర్మల అన్నారు. కందిలో ఆశించే ముఖ్యమైన చీడపీడలలో మరుకా మచ్చల పురుగు ముఖ్యమైందని, రైతులు సకాలంలో పురుగు ఉధృతిని గమనించి యాజమాన్య పద్ధతులు పాటించి పంటను రక్షించుకోవాలని వివరించారు.

పురుగు లక్షణాలు..

- మారుకా మచ్చల పురుగు మొగ్గ, పూత దశలో ఆశించి ఎక్కువ నష్టం కలుగజేస్తుంది. పూత దశలో పూలను గూడుగా చేసి లోపలి పదార్థాలను తింటుంది.
- కాయలు తయారయ్యేటప్పుడు దగ్గరకుచేర్చి గూడు కట్టి, కాయలకు రంధ్రం చేసి లోపలి గింజలను తినడం వల్ల పంటకు ఎక్కువ నష్టం కలుగుతుంది.
- గూడు దగ్గర లార్వా విసర్జితాలు కనిపిస్తాయి. గూళ్లు విప్పినప్పుడు తెల్లపు వర్ణం కలిగిన పిల్ల పురుగులను గమనించొచ్చు.
- ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పూత గెలబూజుగా మారుతుంది.



కంది పంటను ఆశిస్తున్న మారుకా మచ్చల పురుగు

అనుకూల పరిస్థితులు..

పూత దశలో మేఘావృతమైనప్పుడు, పొగ మంచు, అడపాదడపా చిరుజల్లులు కురిసినప్పుడు, ఈ పురుగు ఉధృతికి కారణమయ్యే అనుకూలమైన పరిస్థితులు.

యాజమాన్య చర్యలు..

పూతదశలో తప్పనిసరిగా పైరుపై 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనె (1500 పీపీఎం) 5 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే రెక్కల పురుగులు గుడ్లు పెట్టడానికి ఇష్టపడవు. అంతేకాక అప్పటికే పంట మొక్కలపై ఉన్న గుడ్లు కూడా పగిలి చనిపోతాయి.

మొగ్గ పూత దశలో అక్కడక్కడ కొన్ని మొగ్గలను సేకరించి వాటిని తెరిచి పిల్ల పురుగులు ఉన్నాయేమోనని పరిశీలించాలి. పిల్ల పురుగులు గమనిస్తే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా నోవాల్యురాన్ 0.75 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

పురుగు ఉధృతి అధికంగా గమనించినప్పుడు స్పైనోశాడ్ 0.3 మిల్లీ లీటర్లు లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మిల్లీ లీటర్లు లేదా క్లోరాంట్రానిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లేదా లాంబ్డాసైహాలో త్రిన్ 1 మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి కలిపి పైరుపై పిచికారీ చేసినట్లయితే ఫలితం ఉంటుంది.